ఏమిటి? 'ఎల్లప్పుడూ మంచి రుచిని కలిగించే కాఫీపొడి' అని వుండాలి. 'కప్పు కప్పుకీ మీరు నమ్మదగిన' అంటే అన్వయం సరిగాలేదు. 'అలవాటుగా మీరు తాగే కాఫీ రుచి' అని వుండాలి. బోల్డు డబ్బు తగలేసి ఇలాటి రాతలురాయించడం దేనికి – ఆ ప్రకటన చూసి చదివే వారికి బోధపడాలా? అన్నిట్లోకి 'టార్ టాయిస్' కార్టూన్ ప్రకటనలు బావుంటాయి. అల్లాగే నాగార్జున వారి సిమెంటు కార్టూనులు.

ఇది చూడండి బాబూ – 'ఉన్నత తరగతికి చెందిన వినియోగదారులపై ఒక పావు శతాబ్దపు పన్నీటి జల్లులు' ఏమన్నా అర్థమవుతోందా? ఇది ఒక 'వాటర్ హీటర్' గురించిన ప్రకటన. 'ఇరవై అయిదు సంవత్సరాలుగా సేవలందిస్తున్న' అని వుండాలి. పెద్ద కుటుంబాలవారు హీటర్లని వాడే స్తోమత కలిగి వుంటారు. 'కలిగిన ఇళ్ళలో' అన్నా అర్థం చెడదు. ఇందులోనే మళ్ళీ 'ఉజ్వల జీవనాన్ని ఆస్వాదించే ప్రజల నుండి' – అన్నారు. 'ఉన్నత జీవిత సరళికి చెందే ప్రజల అనుభవం నుంచి' అనడానికి మారు 'ఆస్వాదించే' అంటూ హాస్యాస్పదంగా తయారయింది. పూల తావిని ఆస్వాదిస్తారు. స్నానం అనేది ఒక అనుభవం! 'వేణ్ణీళ్ళ స్నానానికి మా హీటర్ పాతికేళ్ళుగా పెట్టింది పేరు' అని చెప్పాలి.

ఈ ప్రకటనలు తీర్చి దిద్దేవాళ్ళంతా ఏ బొంబాయి లోనో, కలకత్తా, ఢిల్లీ వంటి మహా నగరాల్లో కూర్చుని అన్ని భాషల మీద పెత్తనం చెలాయిస్తూ వుంటారు. 'అయితే వాళ్ళిష్టం వచ్చినట్లు రాసుగుంటారు. నీకేమిటి?' అని అంటారు. 'అయ్యో వెర్రివాళ్ళలారా ఈ ప్రకటనల కిచ్చే సొమ్మంతా మనం కొనే వస్తువుల ధరలోనే వుంటుంది కదా! అంచేత సొమ్ము మనది భాష మనది, సోకు బొంబాయి వాడిది.'

తెలుగు భాషా సరస్వతిని బొంబాయి వీధుల్లో నిలబెట్టి సరస్వతీ వస్త్రాపహరణం చేయొద్దని నా గోల, నా ఏడుపు, నా బాధ, నా తిక్క కోపమ్.... ఎట్సెట్రా.

# వేళాకోళం లెక్చర్ 'టూ'

**ఒ**కాయన్ని జీవితంలో కష్టమైన కార్యం ఏది అని అడిగితే ఒకరు వండిన వంటలు 'భోంచెయ్యడం' అన్నాట్ట! (ఏదైనా ఎంత తిన్నా తిన్నది అరిగించుకోడం కొంచెం కష్టమే – తిండి యావ మహాదరిద్ర కారణం అన్నారు మనవాళ్ళు. 'తిండి కలిగితె కండ కలదోయ్' అని గురజాడవారుఅన్నా – తిన్నదంతా కండలుగా మారుతుందంటె నమ్మశక్యం కావడంలేదు–) మనవాళ్ళ పెళ్ళిళ్ళలో మంగళసూత్రం ముడెట్టించడం కష్టంగాదు – పెళ్ళివారి చేత బోయినాలు చేయించడం కుప్పుసామయ్యర్ డిఫికల్టంత డిఫికల్టాతి డిఫికల్టు. తిండి కలిగితె కండ కలదోయ్ కండ కలవాడే మనిషోయ్' అంటె పెళ్ళివారు వూరుకోరు. కండచీమకి ఏమంత కండ వుందని

'కండ చీమ' అంటున్నారు అని క్రొశ్నిస్తారు. పెళ్ళివారి బోయినాల ఛాప్టరు కంటె - కాంప్లికేటయిన విషయం మరోటుంది. అది పెళ్ళి పిలిపింగ్స్.... ఇది స్వామివారి జ్యోతిర్లింగంలాగ ఆది మధ్యాంతరహితం. పెళ్ళి పిలిపింగ్స్ కష్టాతికష్టమైన ఫీట్ - పిలిస్తే పలకనివాడు ఆ భగవంతుడు తప్ప అంతా పిలిపించుకుంటారు. ఈ పిలిపింగ్స్ ద్వివిధాలు. అంటే 'పెళ్ళివారిని పెళ్ళివారు' 'రండి బోయిస్' అని పిలవడం. అదిగాకుండా శుభలేఖలో 'బంధుమిత్ర సపరివారంగా' అని వుటంకిస్తాము గదా - వాళ్ళను పిలవడంలో కూడా సొగసైన బాధ వుంది. (బొట్టూ, కాటుకా పెట్టి పిలవాలా నిన్ను? అని మనవాళ్ళు చనువుతో అయిన వాళ్ళను మందలిస్తూ వుంటారు. కాని నాకో డవుటు. బొట్టు పెట్టడం ఆచారం కానీ, ప్రతి వాళ్ళని కూచో పెట్టి కుంచెడు కాటుక కన్నుపోయేట్లు ప్రతివారికీ పెడతారా(?) అని.)

పూర్వం పెళ్ళి పిలుపుకి కూడా బాజాలు, మేళతాళాలతో వెళ్ళేవాళ్ళు. రెండు మెతుకులు నోట్లో కుక్కుకుని పెళ్ళాం యిచ్చిన వక్కపొడిని నోటి గూట్లోకి విసిరేసి సైకిలో, స్కూటరో, బస్సో, రిక్షానో ఎక్కి ఆఫీసుకు పరిగెత్తే మనుషులకీ, పెళ్ళికి తరలివెళ్ళేవారికీ తేడా లేదా? ఆఫీసు నడకలకీ, పెళ్ళివారి నడకలకీ హస్తిమశకాంతరం తేడా లేదూ? పల్లకీ వెనక పెళ్ళివారు నడుస్తూంటే ఆ పట్టు చీరలూ, ఆ వెండి బంగారాలూ, ఆ నడకల వయ్యారాలూ, కలకలలూ, కిలకిలలూ అంతా ఒక పూల తోట, పెళ్ళి పల్లకీ వెనక నడుస్తున్నట్లు అనిపించేది. ఇప్పుడు చాలా మంది ఊరేగింపుల్ని ఎత్తించేశారు. పల్లెటూళ్ళలో ఇంకా పెట్రోమాక్సు లైట్లతో ఊరేగింపులు వున్నాయనుకుంటాను.

పెళ్ళి అనేది అనేక వర్ణ చిత్రమాలిక లాటిది. సంగీతంలో రాగమాలికతో పోల్చవచ్చు. ఆడపిల్ల పెళ్ళి చేసేవారి పట్ల సమాజానికి ఎంతో దయవున్నట్లు కనిపిస్తుంది. ఆడపిల్ల పెళ్ళి అంటే అంతా సహాయం చేస్తారు. గోడలకి సున్నం వేసి, గడపలకు పసుపు రాయడంతో పెళ్ళికళ వచ్చేస్తుంది. పందిరి కాని, షామియానా కాని వేసేస్తే - పిల్లలంతా అక్కడే అల్లరి చేస్తూ, అరుస్తూ, పాడుతూ, గెంతుతూ వుంటారు. తాటాకు పందిరిచుట్టూ మామిడి తోరణాలు, పచ్చని అరటి బోదెలు కట్టగానే పెళ్ళికళతోపాటు పెళ్ళి వాసనలు కూడా వచ్చేస్తాయి. పెళ్ళికి వచ్చే చుట్టమ్స్ కూడా ఒకరి తరువాత ఒకరు సర్‌ప్రయిజుల్ని ఒలికిస్తూ రావడాలు ఆ హడావిడి అంతా పెళ్ళి టెంపోనుక్లయిమాక్సుకి లాక్కెళ్ళిపోతుంది.

అసలు పెళ్ళితంతంతా పిలుపుల్తో ప్రారంభమయితే పిలుపులు శుభలేఖలచ్చయాక కదా బిగినయేది. శుభ లేఖలు ఎన్నివెయ్యాలో ఎవరూ చెప్పలేరు. శుభలేఖలో ఒక మిరక్యులస్ టచ్ వుంది. దాంట్లో వోల్టేజి తక్కువయినా కొంత పవరుంది. పసుపు, సెంటు రాసుకుని ముస్తాబయిన శుభలేఖ బాలసరస్వతిలా వుంటుంది. పెళ్ళికూతురి చుట్టూ చెలికత్తెలు చేరగానే ఆ చోటు కాస్తా చిలకల పందిరిలా వుంటుంది.

ఈ రోజుల్లో పెళ్ళికి ముందే ముఖ్యమైనవాళ్ళకు డి.వో.లెటర్లు రాస్తారు. అలా రాయడం వలన ఆ ఉత్తరాల్ని అందుకున్న వాళ్ళు తామొక వి.ఐ.పి.లమని (సూట్‌కేసుల్లా) పొంగిపోతారు.

ఒక గొప్ప ఈవెంట్ తమకు ముందే తెలిసిపోయినట్లు ఉబ్బులింగాలైపోతారు. మామూలుగా శుభలేఖని దాని ఆడియన్సునిబట్టి అవతలి వాళ్ళు యివతలివాళ్ళను జడ్జి చేస్తారు. శుభలేఖలు పాతనేస్తాలను అందర్నీ ఓ మాటు పలకరించి మురిపిస్తాయి. శుభలేఖలు వేసేప్పుడు ఎవరెవరు ఎక్కడెక్కడ వుందీ గుర్తుచేసుకుంటాము.

ఒక్కోసారి శుభలేఖలు అచ్చువేసి బిళ్ళలంటించి బంధుమిత్రులకు పోస్టు చేశాక పోస్టల్ చార్జీలు పెరిగితే - యిహ చూస్కోండి తమాషా!

శుభలేఖ టచ్ గోల్డెన్ టచ్! 'ప్రేమలేఖ గొప్పదా? శుభలేఖ గొప్పదా' అని మా గురూగార్ని అడిగితే ప్రేమలేఖలన్నీ శుభలేఖలే గదా అన్నారు. ప్రేమలేఖల్లో చాలా రకాలున్నాయి; అందులో పెళ్ళయిన వాళ్ళు తమలో తాము రాసుకునేవి (అందులో ఎలిమెంటాఫ్ సర్ ప్రయిజ్ వుండదు విరహ బాధ తప్ప)- పెళ్ళి కానివాళ్ళు తహతహ లాడుతూ రాసుకునేవి దొంగ లెటర్స్ వాట్నే దొంగ ఉత్తరాలంటారు.

అస్సలీ లోకం ఫూలిష్‌నెస్ కాని 'ప్రేమలేఖలు' పెళ్ళికాని జంటలే కదా రాసుకునేది? పులులూ సింహాలు, ఏనుగులూ లొట్టి పిట్టలూ ప్రేమలేఖలు రాసుకోవు గదా!

పిలుపులకి వెళ్ళినపుడు ఎంతమందినో పలకరించాలి! మాట్లాడాలి! నమస్కారాలు, చేయి విదళింపులూ, కరచాలనాలూ, హస్త లాఘవాలూ చేయాలి.

అన్నిటికంటె - ఎవరేమిచ్చినా తినాలి, తాగాలి, వద్దన కూడదు. కాఫీ, టీ, గోల్డ్‌స్పాట్, మజా, ఓల్టిన్, కోకో ఏదిచ్చినా తాగాలి. ఇవి భరించలేకపోతే కూడా ఒక ఫ్లాస్క్ తీసుకెళ్ళి లేదా. రెండో మూడో తీసుకెళ్లి అందులో పోయించుగుని యింటికొచ్చి ఆరారగా తీసుకోవాల్సిందే.

ఎంతమందిని ఎంత జాగ్రత్తగా పిలిచినా, చాలా ముఖ్యమైన వాళ్ళనీ, కావలసినవాళ్ళనీ పిలవడం మర్చిపోయే ప్రమాదం వుంది. ఎలా మర్చిపోతామంటే పెళ్ళయాక పిలవని బంధుమిత్రుల జాబితా మనల్ని భయపెట్టేస్తుంది. మనల్ని పిబ మిత్రులు ( అంటే పిలవని బంధు మిత్రులు) క్రిమినల్సు గాను ద్రోహుల్లానూ చూస్తారు. 'నీ కూతురు పెళ్ళికి నన్ను పిలవలేదు గదా - కాస్కో' అని జీవితాంతం చిన్న చూపు చూసినట్టు ఫీలయి విరోధ భావంతోనే వుంటారు. పిలుపులు మేక్ ఎనిమీస్ వైస్ వెర్సా.

పెళ్ళికి వెళ్తే భోంచేసి వస్తే చాలా, పెళ్ళి కూడా చూసి రెండు అక్షింతలు వేసి రావాలా అని చాలమందికి డవుటు. కొందరంటారు భోంచేస్తే పెళ్ళికి వచ్చినట్టు సాక్షి సంతకాలతో దస్తావేజు మీద సైన్ చేసినట్లేనని. మరికొందరంటారు పెళ్లి ముహూర్తానికి అటెండయి అక్షంతలు వేసి వస్తే భోంచేసినా చేయకపోయినా (బొడ్డుంబాల్) ఫలితం దక్కినట్లేనని. ఈ మీమాంస ఏ సుప్రీం కోర్టు న్యాయాధిపులో తీర్చాలి. గుళ్ళో దేవుడికి నమస్కారం బెడితే సరిపోదా, కొబ్బరి కాయ కూడా కొట్టాలా అని మరి కొందరికి మరింకో రకం డవుటు.

పెళ్ళిళ్ళలో శుభలేఖలు రాసేపుడు ఒక్కరి చేతి మీదుగా అడ్రసులు రాయడం జరగదు కదా – ఒకరు రాయలేదని ఒకరు యిలా ఒకే అడ్రసుకి మూడు నాలుగు కార్డులు వెళ్ళే ప్రమాదం వుంది. లేనివాళ్ళకు అసలు ఒక్క కార్డు కూడా వెళ్ళదెళ్ళదు.

పోస్టలు వాళ్ళు ఉత్తరాల్నీ శుభలేఖల్నీ గ్రీటింగుల్నీ పంచలేక కట్ట కట్టి అవతల పారేస్తూ వుంటారని తత్కారణంబున మనం వేసినా ఎవరికీ అందక ఆభాసుపాలవుతూ వుంటారు పెళ్ళివారని కొందరంటారు. మన దేశంలో అంత నమ్మక ద్రోహం జరుగుతుందా అని ఓ డవుటు – కట్నాలు కానుకలు లాంఛనాలు తీసుగుని పెళ్ళి చేసుకున్నవారి కున్నంత నీతి నిజాయితీ ఉద్యోగుల కుండట్లేదని మనం వాపోతే ఎలా?

అసలు కార్డ్స్ అందకపోవడానికి కారణం మనం వేసామనుకుని వెయ్యడం మరిచిపోయి వుండాలి.

మా వారిలాగా – అంటె అమెరికాలో మా వారు శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉత్తరాల డొక్క అనుకుని నీలం డస్ట్ బిన్‌లోకి ఉత్తరాల్ని వేసినట్లు – శుభలేఖలు ఎప్పటికీ ఎన్నటికీ తెరవని పోస్టు డొక్కుల్లో వేసి వుండాలి.

పిలవడాలు సరిగా లేకపోతే పెళ్లిలో ఫస్ట్ పార్ట్ కుదేలయినట్లే – మనం రాసినా వాటిని తిన్నగా ఓపెన్ చేసే డొక్కుల్లో వేయద్దూ – పిలిపింగ్సంటే మాటలా – తరవాత మిగిలేవి దెప్పుళ్ళే!

# అంతరంగ మథనం

'**ఆ**ఫీసుకారు' అనేది ఓ చిన్న స్టేటస్ సింబల్. ఆ కారు తలుపులు తీసిపట్టుకునే చక్రపాణి వుంటే – యింకా బలే మజాగా బావుంటుంది. వాడికి ఓ డవాలీ, మన ముఖ్యమంత్రిగారి తలపాగా కంటె మించిన కుచ్చుల తలపాగా కాలికి చడావులూ వుంటే కడుంగడు దర్జాగా వుంటుంది. పూర్వం రథాలు, గుర్రాలు, ఏనుగులు, పల్లకీలు వున్నట్లే యిప్పుడు ఆఫీసు జీపులు, ఆఫీసు కార్లూ వెలిశాయి. సొంతకారు లేనివారికి ఆఫీసుకారు 'వెండికొండ'. ఆఫీసు కారుకి సొంతకారుకీ తేడా ఏవిటని అడిగారంటే – సత్యభామకి రుక్మిణికి వున్నంత తేడా వుంటుంది. మతాతీత మైన రాజ్యాంగంలాగా ఆఫీసు కారు సెక్యులర్ – సొంత కారున్నవాళ్ళు కూడా ఆఫీసు పనులకు ఆఫీసు కారే వాడ్తారు. ఆఫీసుకారున్న వాళ్ళకు కొందరికి కారు యోగ్యతే నిజ జీవితంలో వుండదు.

పిల్లలకి, ఆడాళ్ళకి కారెక్కడవంటే బలే సరదా! కారు ఎక్కినా ఎక్కకపోయినా 'పప్పాయి...పాం....పాం' అంటూ రబ్బరు బూరానొక్కడం గమ్మత్తుగా వుంటూ నొక్కే చేతులకి